ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రమీద గార్డెన్‌లో ఇబ్రహీంపట్నం కార్యకర్తల దసరా సమ్మేళనానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

దశాబ్ది ఉత్సవాలకు రండి

కేటీఆర్‌కు మలేషియా

తెలంగాణ అసోసియేషన్ ఆహ్వానం

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): వచ్చేనెల 9న మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగే తెలంగాణ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలకు రావాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఆదివారం హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలోని ప్రతినిధులు కలిసి కేటీఆర్‌కు ఆహ్వానలేఖ అందించారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు కార్తీక్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి ఉన్నారు.

40% కూడా రుణమాఫీ కాలే

40 లక్షల రైతులు ఎనుముల ఇంటెలిజెన్స్ లెక్క: కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : రైతు రుణమాఫీపై జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో చేసిన పోస్టుపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. అది పచ్చి అబద్ధమని మండిపడ్డారు. ఇప్పటి వరకు 40 శాతం కూడా రైతు రుణమాఫీ కాలేదని స్పష్టం చేశారు. తెలంగాణలో 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్టు ఎక్స్‌లో కాంగ్రెస్ చేసిన పోస్ట్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రుణమాఫీ చేసినట్టు ఇచ్చిన ప్రకటనలో ఏ విధంగా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపొందించిన చిత్రాన్ని వాడారో.. రుణమాఫీ జరిగిన రైతుల లెక్కల విషయంలోనూ సీఎం రేవంత్‌రెడ్డి అదే టెక్నిక్ వాడారంటూ ఎద్దేవాచేశారు. 'కృత్రిమమేధ (ఏఐ) దృశ్యాలను మార్చినట్టు ఎనుముల ఇంటెలిజెన్స్ (ఏఐ) హామీల తేదీలు, లెక్కలు మార్చుతున్నది' అని ఎద్దేవాచేశారు. 'ఇప్పటివరకు రాష్ట్రంలో 22 లక్షల మంది రైతులకు..అంటే 40 శాతం కంటే తక్కువ మందికే రుణమాఫీ అయిందని, ఇంకా 60 శాతం మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉన్నది పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత గ్రామం, సొంత నియోజకవర్గంలో కూడా రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బూటకపు ప్రచారాలు నిత్యం దిగ్విజయంగా కొనసాగుతున్నాయని ఎద్దేవాచేశారు.

మంచి రిపోర్టే ఇస్తది!

దక్షిణ కొరియాలోని సియోల్ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ పరిశీలనకు వెళ్లిన తెలంగాణ నిపుణుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి ఫలప్రదమైన నివేదికనే అందిస్తుందని, మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లు ఖర్చవుతాయన్న అంచనా రిపోర్టు అందజేస్తుందని కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు.'ఇక్కడి నది పునర్జీవం కోసం తెలంగాణ ప్రభుత్వం సియోల్‌లో వాగు పరిశీలన కోసం నిపుణులు, పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, అధికారుల బృందాన్ని పంపడం ప్రశంసనీయం. ఆ బృందం రాష్ట్ర ప్రభుత్వానికి మంచి నివేదికనే అందిస్తుంది. సుమారు రూ.1.5 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు పూర్తవుతుందనే నివేదిక ఇస్తుందనే నమ్మకం నాకున్నది' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

పోరాడాల్సిన కమ్యూనిస్టులు ఎక్కడ?

- ప్రభుత్వ తీరుపై రైతు సంఘాల నోళ్లెందుకు మూతపడ్డయ్
- వానకాలం రైతుభరోసాకు కాంగ్రెస్ సర్కార్ రాంరాం
- ఫార్మాసిటీ, ఫోర్త్‌సిటీలపై సీఎంవి దొంగమాటలు
- అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్తాం
- అన్ని వర్గాలకు కాంగ్రెస్‌మోసం
- బీఆర్‌ఎస్ దసరా సమ్మేళనంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆదిబట్లలో జరిగిన బీఆర్‌ఎస్ దసరా సమ్మేళనంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి తదితరులు

రంగారెడ్డి, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ అంటేనే భారతీయ రైతు సమితి అని, తాము ఎలాగూ రైతుల కోసం పోరాటం చేస్తామని, కానీ.. రైతుల పక్షాన పోరాడాల్సిన కమ్యూనిస్టులు ఎక్కడ? అని, రైతు సంఘాల నోళ్లెందుకు మూతబడ్డాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. భూముల విషయంలో ఫార్మాసిటీ రైతులనే కాకుండా అన్నివర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని, ఇప్పుడు వానకాలం పెట్టుబడి సాయం రూ.15 వేలకు కూడా రాంరాం చెప్పిందని మండిపడ్డారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రమీద గార్డెన్‌లో బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర యువజన నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం కార్యకర్తల దసరా సమ్మేళనాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించగా, కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికలప్పుడు అశోక్‌నగర్ వెళ్లి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని, రెండు నెలలు గడిస్తే ఏడాది అవుతదని, ఉద్యోగాల మాటేమోగానీ..రాహుల్‌కు ప్రతిపక్ష నేతగా, రేవంత్‌రెడ్డికి సీఎంగా ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. జీవో 29తో రిజర్వేషన్ల విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకూ అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు.

> కాంగ్రెస్ వస్తే రైతుబంధుకు రాంరాం.. దళితబంధుకు జైభీమ్ అంటరని కేసీఆర్ ముందే చెప్పిండ్రు. ఇప్పుడు అదే జరిగింది -కేటీఆర్

> ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిప్ దొబ్బింది.. దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు దొరుకుతయంటడు.. తెలంగాణలో భాక్రానంగల్ ఉందంటడు. హైదరాబాద్ చుట్టూ మూడు వైపులా సముద్రం ఉందంటడు.. రాష్ట్రం మొత్తాన్ని ఆగం చేస్తున్నడు. -కేటీఆర్

రైతుల నోట్లో రేవంత్ మట్టి

వానకాలం రైతు భరోసాకు రాంరాం చెప్పి రైతుల నోట్లో రేవంత్‌రెడ్డి మట్టికొట్టాడని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఖరీఫ్ రైతు భరోసా ఎగ్గొడుతున్నామని సిగ్గులేకుండా వ్యవసాయ మంత్రి తుమ్మల చావు కబురు చల్లగా చెప్పిండని విమర్శించారు. రైతు భరోసాను ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్ర ఇది అని మండిపడ్డారు. 'స్కూళ్లల్లో చాక్‌పీస్‌లకు, దవాఖానల్లో మందులకు, పోలీసుల బండ్లలో పెట్రోల్‌కు పైసలు లేవంట..కానీ మూసీలో పోసేందుకు లక్షా యాభై వేల కోట్లు ఉన్నాయట!' అని ఎద్దేవాచేశారు. మూసీ శుద్ధి కోసం కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా నీళ్లు తెచ్చి నదికి అనుసంధానం చేయాలని నిర్ణయించడంతోపాటు బీఆర్‌ఎస్ హయాంలో ఎస్టీపీలు నిర్మించామని గుర్తుచేశారు. ఢిల్లీకి మూటలు పంపేందుకే మూసీ నాటకం ఆడుతున్నారని విమర్శించారు.

> ఎన్నికల ముందు మూడు పంటలకు సాయం అందించాలని చెప్పిండు. కేసీఆర్ రూ.10వేలు ముష్టి వేస్తున్నడు.. మేము రూ.15వేలు ఇస్తామని బడాయి కొట్టిన సిపాయి ఇప్పుడు ఎక్కడ? -కేటీఆర్

అన్నీ అబద్ధపు హామీలే

'ఎన్నికల ముందు రైతు కూలీలు, కౌలు రైతులకు ఆర్థిక సాయం అన్నడు. బోనస్ అని బోగస్ మాటలు చెప్పిండు' అని రేవంత్‌పై కేటీఆర్ మండిపడ్డారు. 'మహిళలకు తులం బంగారం అంటివి ఏ మైంది?' అని నిలదీశారు. 11 నెలల్లో 4 లక్షల పెండ్లిళ్లు అయ్యాయని, త్వరలో మరో 2 లక్షల పెండ్లిళ్లు అవుతాయని, ఇప్పటికైనా తులం బంగారం కార్యక్రమాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి కాదని.. గోల్‌మాల్‌రెడ్డి అని విమర్శించారు.

రైతుల పక్షాన పోరాడుతాం

ఫార్మాసిటీ..ఫోర్త్‌సిటీలపై సీఎం రేవంత్‌రెడ్డి దొంగ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నాడని కేటీఆర్ ఆగ్రహంవ్యక్తం చేశారు. కాలుష్యం లేకుండా గ్రీన్ ఫార్మాసిటీని నిర్మించేందుకు కేసీఆర్ కృషిచేశారని పేర్కొన్నారు. ఎనిమిదేండ్లు కష్టపడి రైతులను ఒప్పించి, మెప్పించి 14 వేల ఎకరాలు సేకరించామని చెప్పారు. భూములు గుంజుకోబోమని ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి, సీతక్క, కోదండరెడ్డి తప్పుడు ప్రచారం చేశారని దుయ్యబట్టారు. 'దమ్ముంటే ఫార్మాసిటీని రద్దు చెయ్..రైతుల భూములను తిరిగి ఇవ్వు' అని సీఎంకు కేటీఆర్ సవాల్ విసిరారు. చట్టం ప్రకారం ఫార్మాసిటీ కోసం తీసుకున్న భూములను వేరేదానికి వాడడానికి వీలులేదని, సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ విషయంలో కోర్టును కూడా తప్పుదోవ పట్టిస్తున్నాడని మండిపడ్డారు. రైతుల పక్షాన బీఆర్‌ఎస్ న్యాయ పోరాటం చేస్తుందని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని స్పష్టంచేశారు. ఫార్మాసిటీ రైతులు సహ అన్నివర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని, గల్లీగల్లీ తిరిగి కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. గ్రామగ్రామాన మనమే కథానాయకులుగా మారాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. దసరా సమ్మేళనంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు క్యామ మల్లేశ్, ప్రశాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

> గతంలో చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి లాంటి వాళ్లతోనే కొట్లాడి రాష్ట్రాన్ని తెచ్చుకున్నం. ఈ చిట్టినాయుడెంత? చిట్టి నాయుడుకు ఏం తెల్వది. తిట్టుమంటే మాత్రం తిడుతడు. -కేటీఆర్

అనుమతులుంటే కూల్చేయం

సీఎం ఆదేశాలకు కట్టుబడి ఉంటాం

హైడ్రా కమిషనర్ రంగనాథ్ ట్వీట్

పర్మిషన్లు ఉన్నా కూల్చేసిన ఇండ్లకు నష్టపరిహారం ఇవ్వండి: బాధితులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ): చెల్లుబాటు అయ్యేవిధంగా ప్రభుత్వ అనుమతులు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లబోమని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనకు తాము కట్టుబడి ఉంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. రియల్‌ఎస్టేట్ వెంచర్లు సరైన ప్రభుత్వ అనుమతులతో నిర్మాణాలు చేపడితే, తాము వాటి జోలికి వెళ్లబోమని ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. చెరువులు,కుంటలు,నాలాలు, ప్రభుత్వ భూములు కబ్జా చేసిన చోటే హైడ్రా కూల్చివేతలు ఉంటాయని, ప్రభుత్వం ఇచ్చిన అనుమతి పేపర్లు ఉంటే అధికారులను సంప్రదించాలని సీఎం చేసిన వ్యాఖ్యల వీడియోను పోస్ట్ చేశారు. హైదరాబాద్‌లో చెరువులు, పార్కులను కబ్జా చేశారని హైడ్రా రెండు నెలల్లో 23 చోట్ల 262 నిర్మాణాలను కూల్చివేసింది.

పర్మిషన్లు ఉన్నా కూల్చేసిన వాటి సంగతేంటి?

హైడ్రా వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి శనివారం చేసిన వ్యాఖ్యలపై బాధితుల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. హైడ్రా ఆధ్వర్యంలో అమీన్‌పూర్, పటేల్‌గూడలో పలు నిర్మాణాలను ఇప్పటికే కూల్చివేశారు. తమకు పర్మిషన్లు ఇచ్చి, ఆస్తిని నమోదు చేసి, కరెంట్, నల్లా కనెక్షన్లు ఇచ్చిన ప్రభుత్వమే ఇవి చట్ట విరుద్ధమని కూల్చేసిందని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పుడేమో పర్మిషన్లు ఉన్నవారి జోలికి వెళ్లబోమని సీఎం చెప్తున్నారని, మరి తమ పరిస్థితేమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. హైడ్రా దూకుడుగా కూల్చివేతలు ప్రారంభించడంతో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన పలువురు ఇండ్లు కోల్పోయి వీధినపడ్డారు. కూల్చివేతల సమయంలో ఆయా ఇండ్ల యజమానులు తమ వద్ద ఉన్న పర్మిషన్ల పేపర్లను చూపించినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడేమో అనుమతులు ఉన్న వాటి జోలికి వెళ్లబోమని హైడ్రా కమిషనర్ ప్రకటించిన నేపథ్యంలో కూల్చివేసిన తమ ఇండ్లకు ప్రభుత్వం ఎటువంటి న్యాయం చేస్తుందని బాధితులు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు ఉన్నా హైడ్రా కూల్చివేసిన ఇండ్లకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

సర్కార్ ధోకాపై సమరం

మొదటిపేజీ తరువాయి...

మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మహబూబాబాద్‌లో జరిగిన ధర్నాలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ఎకరాకు రూ.10 వేలు ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి ఏడాది కావొస్తున్నా అతీగతీ లేదన్నారు. డోర్నకల్‌లో జరిగిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్, ఖిలావరంగల్‌లోని పడమరకోటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వరంగల్ తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్లకార్డులతో నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో నిర్వహించిన ధర్నాలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, షాబాద్‌లో నిర్వహించిన ధర్నాలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, చేవెళ్లలో నిర్వహించిన ధర్నాలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, బొంగుళూరు చౌరస్తాలో నిర్వహించిన రాస్తారోకోలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. వికారాబాద్ జిల్లా, బొంరాస్‌పేట మండలంలోని తుంకిమెట్లలో జరిగిన ధర్నాలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, పరిగి బస్టాండ్ వద్ద ధర్నాలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో జరిగిన ఆందోళనల్లో ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, మహారెడ్డి భూపాల్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఇతర నాయకులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నిరసనలో పాల్గొన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మద్దూరులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, జడ్చర్లలో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ మండలం కోడూరులో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, గద్వాలలో బీఆర్‌ఎస్ నేత విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం కేంద్రంలో జరిగిన నిరసనలో మాజీమంత్రి జోగు రామన్న పాల్గొని సీఎం ఫ్లెక్సీని దహనం చేశారు. మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బెల్లంపల్లి లో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధర్నా చేపట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో జరిగిన ధర్నాల్లో మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని సిరిసిల్ల మానేరు బ్రిడ్జిపై బీఆర్‌ఎస్ శ్రేణులు రాస్తారోకో చేపట్టారు. పెద్దపల్లిలోని అంబేద్కర్ చౌక్‌లో రాజీవ్ రహదారిపై మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, అంతర్గాం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేశారు. జగిత్యాలలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆధ్వర్యంలో తహసీల్ చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేసి, రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ధర్మపురిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, గంగాధర మండలంలోని మధురానగర్‌లో జరిగిన ఆందోళనలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాద, త్రిపురారంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ రామచందర్‌నాయక్, మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, ఆత్మకూర్ ఎం.లో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, తాడ్వాయిలో చేపట్టిన ధర్నాలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాగిరెడ్డిపేటలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకొన్నారు. దీంతో వారు ర్యాలీగా వెళ్లి స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. బాన్సువాడ పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రైతు నిరసన దీక్ష చేపట్టారు. మేడ్చల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు రైతులకు మద్దతుగా డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

రైతుబంధు ఇవ్వబోమన్న మంత్రి తుమ్మల వ్యాఖ్యలకు నిరసనగా జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

'తుమ్మల' నోట మరో పచ్చి అబద్ధం

- గత ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిందంటూ విమర్శలు
- దానిని తాము మొన్న చెల్లించినట్టు ప్రగల్భాలు
- ఖమ్మం సభలో బీఆర్‌ఎస్‌పై ఆరోపణలతో అభాసుపాలు

ఖమ్మంలో జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, అక్టోబర్ 20: ఖమ్మం పర్యటనలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు పచ్చి అబద్ధం ఆడారు. ఖమ్మం 16వ డివిజన్ శ్రీరాంనగర్‌లో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ.. 'గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రైతుబంధును మొన్న మేం చెల్లించాం' అంటూ అబద్ధాలు చెప్పారు. తమ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రుణమాఫీ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రూ.50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నదని పేర్కొన్నారు.గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదంటూ ఆరోపణలు గుప్పించారు. కర్షకుల కోసం నిర్విరామంగా రైతుబంధును అందించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై మంత్రి తుమ్మల మరోసారి అబద్ధాలు వల్లించడంతో జిల్లా ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. పదేండ్లపాటు నిరాటంకంగా పంటల పెట్టుబడి సాయాన్ని అందుకున్న రైతుల వద్ద తుమ్మల తన వ్యాఖ్యలతో అభాసుపాలయ్యాయి.

హైడ్రా పేదల జోలికొస్తే ఊరుకోం: కూనంనేని

హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : హైడ్రా అత్యుత్సాహంతో పేదలు,మధ్యతరగతి ప్రజలఇళ్లు కూల్చుతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. మూసీ పునరుజ్జీవనంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్‌పాషా, పశ్య పద్మ, తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఎన్ బాలమల్లేశ్‌తో కలిసి కూనంనేని మాట్లాడారు. హైడ్రా పేదల జోలికి వస్తే సీపీఐ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని హెచ్చరించారు.

యాసంగికీ భరోసాలేదు!

మంత్రుల కమిటీ నివేదిక ఇచ్చేదెప్పుడు?

- అభిప్రాయ సేకరణే పూర్తి చేయని కమిటీ
- 4 నెలలు గడుస్తున్నా పత్తాలేని నివేదిక
- ఇప్పటికే వానకాలం రైతుబంధుకు రాంరాం
- ఈ యాసంగి సీజన్‌లోనూ ఏగనామం!

హైదరాబాద్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ): 15 రోజుల్లో ఇవ్వాల్సిన నివేదిక నాలుగు నెలలైనా పత్తా లేదు. ఎప్పుడు ఇస్తుందో కూడా తెలియదు. అతీ గతీ లేని నివేదికతో రైతుభరోసా పంపిణీకి లింకు పెట్టారు. రైతుభరోసాపై మంత్రుల కమిటీ నివేదిక వచ్చాకే యాసంగి పెట్టుబడిసాయం అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుండబద్దలు కొట్టారు. దీంతో ఆ నివేదిక ఇచ్చేదెప్పుడు.. రైతుభరోసా వచ్చేదెప్పుడు అనే ప్రశ్నలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. బోడిగుండుకు మోకాలికి లింకు పెట్టినట్టుగా పని చేయని కమిటీకి, పెట్టుబడి సాయం పంపిణీకి లింకు పెట్టడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వానకాలం రైతుభరోసాకు ఎగనామం పెట్టిన సర్కారు... ఇప్పుడు కమిటీ నివేదిక సాకుతో యాసంగి కూడా రాం రాం పలికే కుట్ర చేస్తుందేమో అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

నివేదిక ఇంకెప్పుడు...?

బీఆర్‌ఎస్ హయాంలో రైతుబంధు పథకంలో అవకతవకలు జరిగాయని ఆరోపించిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాలో మార్పుల కోసం జూలై 2న మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబులను భాగస్వామ్యం చేసింది. ఈ కమిటీ రైతుల అభిప్రాయాలు సేకరించి 15 రోజుల్లో నివేదిక అందిస్తుందని, ఆ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో చర్చించి రైతుభరోసా విధివిధానాలు ఖరారు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పగా ప్రకటించారు. ఈ లెక్కన కమిటీ తన నివేదికను జూలై 17వ తేదీ నాటికి ప్రభుత్వానికి అందిజేయాలి. కానీ మరో వారం రోజులైతే కమిటీ ఏర్పాటు చేసి విజయవంతంగా నాలుగు నెలలవుతుంది. ఇప్పటికీ కమిటీ నివేదికకు దిక్కూ దివాన లేదు. ప్రస్తుతానికి ప్రభుత్వంలో ఈ కమిటీ నివేదికపై ఎలాంటి చర్చ జరగడంలేదని తెలిసింది. ఈ కమిటీలోని మంత్రులు కూడా నివేదికకు సంబంధించి ఈ మధ్య కాలంలో సమావేశం కాలేదు.. చర్చించలేదు. అలాంటప్పుడు ఈ కమిటి నివేదిక ఇస్తుందా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

అభిప్రాయాలే సేకరించలేదు

రైతులు, రైతు సంఘాల అభిప్రాయాల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామాకే తెరతీసింది. ఉమ్మడి జిల్లాల వారీగా తొమ్మిది సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించింది. ఆ తర్వాత మంత్రులు, ప్రభుత్వం చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. ఉరుకులు పరుగుల మధ్య హడావిడిగా నాలుగు సమావేశాలు నిర్వహించి ఆపేసింది. మిగిలిన ఐదు సమావేశాలకు మంగళం పాడేసింది. ఈ నేపథ్యంలో అసలు కమిటీ చేయాల్సిన అభిప్రాయ సేకరణే పూర్తి కాలేదు. అసెంబ్లీలో రైతుభరోసా అంశంపై కనీస చర్చ కూడా చేయలేదు.

నివేదిక ఇచ్చేదెప్పుడు..

రూ. 2 లక్షల లోపు రైతుల రుణమాఫీని డిసెంబర్‌లో పూర్తి చేసిన తర్వాత రైతుభరోసా గురించి ఆలోచిస్తామని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ లెక్కన డిసెంబర్ వరకు రైతుభరోసా పెట్టుబడి సాయం అందదనేది సుస్పష్టం. ఆ తర్వాత మంత్రుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా పంపిణీ చేస్తామని తెలిపారు. అలాంటప్పుడు ఈ కమిటీ భేటీ అయ్యేదెప్పుడు.. నివేదిక ఇచ్చేదెప్పుడు.. రైతులకు రైతుభరోసా ఇచ్చెదెప్పుడు అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ పూర్తయ్యే సరికి యాసంగి కూడా ముగిసిపోతుందని, వానకాలం మాదిరిగానే యాసంగి రైతుభరోసా ఎగనామం ఖాయమనే అభిప్రాయాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.